క్లుప్తంగా

డ్రెయిన్ల నిర్మాణ పనుల పరిశీలన



నందిగామ రూరల్: మ్యాజిక్ డ్రెయిన్‌ల వల్ల మురుగునీటి పారుదల సమస్యను శాశ్వతంగా పరిష్కరించవచ్చని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన మండలంలోని సోమవరం గ్రామంలో చేపడుతున్న మ్యాజిక్ డ్రెయిన్‌ల నిర్మాణ పనులను బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మ్యాజిక్ డ్రెయిన్‌ల నిర్మాణం తక్కువ ఖర్చుతో కూడుకున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కళావతి, గురుప్రసాద్, చెరుకూరు హైమారావు, సాత్విక, తోట నాగమల్లేశ్వరరావు, వినయ్, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

11న హుండీ కానుకల లెక్కింపు

వేదాద్రి(జగ్గయ్యపేట): స్థానిక యోగీనంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు ఈ నెల 11న జరుగుతుందని ఆలయ ఈవో కె.సురేష్‌బాబు బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ అధికారుల సమక్షంలో జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న భక్తులు లెక్కింపులో పాల్గొనాలని ఆయన కోరారు.

ఎంఈవో వెంకయ్య బాధ్యతల స్వీకరణ



వీరులపాడు: ఎంఈవోగా కారుమూడి వెంకయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుంటూ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

తిరువూరురూరల్: మండలంలోని పెద్దవరం, వావిలాల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని రైతులకు ఖరీఫ్ సీజన్‌లో పంటల సస్యరక్షణ చర్యలు, నీటి యాజమాన్యంపై వ్యవసాయాధికారి పద్మ అవగాహన కల్పించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధి చేకూరని రైతులు రైతు సేవా కేంద్రాల్లో వివరాలు సమర్పించాలని సూచించారు. పెద్దవరం సర్పంచి గద్దె అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాలు

పట్టించుకోని అధికారులు



అసంపూర్తిగా ముచ్చింతాల అంగన్‌వాడీ కేంద్రం

పెనుగంచిప్రోలు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనాలు ఉండాలనే ఉద్దేశంతో మొదటగా నాడు- నేడు ఫేజ్-2లో భాగంగా మండలంలో 8 అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణాలకు నిధులు మంజూరు చేయక పోవటంతో పనులు మధ్యలో నిలిచి పోయాయి. మండలంలో మొత్తం 15 గ్రామ పంచాయతీలకు గాను 54 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 28 కేంద్రాలకు శాశ్వత భవనాలు ఉన్నాయి. 12 అద్దె లేని భవనాలు, 14 అద్దె భవనాలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో పెనుగంచిప్రోలులో- 3, ముచ్చింతాల-1, గుమ్మడిదుర్రు-1, అనిగండ్లపాడు- 2, వెల్లుర్తిపాడులో-1 అంగన్‌వాడీ కేంద్రాలకు భవన నిర్మాణాలు చేపట్టారు. అయితే ప్రభుత్వం మారిన తరువాత నిధుల లేమితో నిర్మాణాలు నిలిచిపోయాయి. పూర్తయ్యేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. నిర్మాణాలపై ఎస్ఎస్‌పి ఏఈ ప్రసాద్‌ను వివరణ కోరగా 8 భవనాలకు గాను నాలుగు భవనాల నిర్మాణం పూర్తి అయిందని, మిగిలిన వాటిలో కూడా డోర్లు కిటికీలు, కరెంట్, ఫ్లోరింగ్, రంగులు పనులు మిగిలాయని, నిధులు మంజూరు వచ్చిన వెంటనే పనులు పూర్తి చేస్తామన్నారు.



పెనుగంచిప్రోలు-3 అంగన్‌వాడీ కేంద్రం దుస్థితి

అబద్ధపు హామీలను ఎండగడదాం

- వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు
- గ్రామాల్లో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు తదితరులు

ముచ్చింతాల, శివాపురం(పెనుగంచిప్రోలు): అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు మోసాలను గడప గడపకు వెళ్లి ఎండగడదామని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని ముచ్చింతాల, శివాపురం గ్రామాల్లో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని పార్టీ మండలాధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అంటే మోసం, దగా అన్నారు. అధికారం కోసం అడ్డగోలుగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయటం బాబుకు పరిపాటిగా మారిందన్నారు. హామీలు అమలు చేయకపోగా ప్రశ్నించేవారిపై కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. ఇచ్చిన ఒకటి రెండు పథకాలు కూడా అరకొరగా ఇస్తూ ప్రజలను బాధిస్తున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడుతున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి అంటే ప్రజలకు గుర్తు వచ్చేది ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షులు మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి నంబూరి రవి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఏలూరి శివాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, జిల్లా ఉపాధ్యక్షులు కొత్తపల్లి పెంటయ్య, జిల్లా కార్యదర్శి నాగబాబు, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చేని రాంబాబు, నియోజకవర్గ గ్రీవెన్స్, ఎస్సీసెల్ అధ్యక్షుడు బోశెట్టి బ్రహ్మం, కీసర లోకేశ్వరరావు, మండల ఎస్సీసెల్ కార్యదర్శి బొడ్డు రవి, ముచ్చింతాల, శివాపురం గ్రామ పార్టీ అధ్యక్షుడు మల్లెంపాటి సతీష్, లగడపాటి జనార్దన్, ఆలయ మాజీ చైర్మన్ లగడపాటి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు ఎల్.సురేష్, గోసెల శివ, తదితరులు పాల్గొన్నారు.

కంభంపాడు గ్రామంలో..

కంభంపాడు(వత్సవాయి): బాబును నమ్మితే మోసపోవడం గ్యారెంటీ అని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం మండలంలోని కంభంపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు గురించి ప్రజలకు వివరించి కూటమి ప్రభుత్వం మోసాన్ని ఎండగట్టాలన్నారు. ఎన్నికల హామీల గురించి ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్రశ్నిస్తా అని పార్టీ పెట్టిన పవన్‌కల్యాణ్ ఎన్నికల హామీల గురించి పట్టించుకోవడం మానేసాడన్నారు. సర్పంచి నగేష్, మండల పార్టీ అధ్యక్షుడు గుత్తా శంకరరావు, రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి చిన్నా, రంగారెడ్డి, నరమనేని వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ కొలికపోగు వెంకటేశ్వర్లు, ప్రముఖ న్యాయవాది సత్యశ్రీనివాస్, జిల్లా రైతు విభాగం అధ్యక్ష్యుడు ఏలూరు శివాజీ, నాయకులు లేళ్ల నాగేంద్రరెడ్డి, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, రూప్లానాయక్, యేశపోగు శ్రీనివాస్, నంబూరి రవి, శ్రీనివాస్‌గౌడ్, ఎం నరేష్, కే శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం



కంచికచర్ల రెండో సెగ్మెంట్‌లో క్యూఆర్ కోడ్ చూపిస్తున్న వేమా, శివకోటి తదితరులు



గోకరాజుపల్లి కార్యక్రమంలో నాయకులు

కంచికచర్ల: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 13 నెలలయినా ఓట్లేసిన ప్రజలను నిలువునా మోసం చేస్తోందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు అన్నారు. స్థానిక రెండవ సెగ్మెంట్‌లో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈమేరకు సురేష్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ప్రజా సమస్యలు పట్టించుకోకుండా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజా పాలనను గాలికొదిలేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రైవేటు కంపెనీలకు భూములు అమ్ముకుని సొమ్ము చేసుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వేమా శివకోటి, బండారుపల్లి శబరి, దేవిరెడ్డి శ్రీనివాసరావు, దేవరకొండ గురవయ్య, ఎం.పాండురంగారావు, దాసరి రాంబాబు, మేకల బాబు, డూండీ, గుగులోతు శివ నాయక్, నారిశెట్టి శ్రీనివాసరావు గొర్రెపాటి రాజు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఏడాది పాలన పూర్తిగా విఫలం

వీరులపాడు: చంద్రబాబు ఏడాది పాలన పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆవుల రమేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని గోకరాజుపల్లి, నందలూరు, పొన్నవరం గ్రామాలలో బుధవారం రాత్రి బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు పూర్తిగా మోసపోయారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం కొట్టుమిట్టాడుతుందని తెలిపారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తే, చంద్రబాబు మాత్రం ఎన్నికల మేనిఫెస్టోను చెత్తబుట్టలో పడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలలో సైతం అర్హులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గోకరాజుపల్లి గ్రామ పార్టీ కన్వీనర్‌గా పంచుమర్తి మార్కండేశ్వరరావు, నందలూరు కన్వీనర్‌గా జూపూడి బాబు, పొన్నవరం కన్వీనర్‌గా మీసాల పుల్లయ్యబాబులను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నువ్వుల విశ్వనాథం, ఆయా గ్రామాల నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎంసీ పదవి ఎస్సీలకే ఇవ్వాలి



మాట్లాడుతున్న మార్కపూడి గాంధీ, ప్రకాష్ తదితరుల

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ముందుగా రిజర్వేషన్ అయిన ప్రకారం ఎస్సీలకే కేటాయించాలని రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మార్కపూడి గాంధీ అన్నారు. కూటమి ప్రభుత్వం జగ్గయ్యపేట మార్కెట్ యార్డు చైర్మన్ పదవి విషయంలో ఎస్సీ మహిళకు కేటాయించిన పదవిని ఎస్సీ మహిళకు కాకుండా ఓసీకి కేటాయించాలని ప్రయత్నించడం ఎంతవరకు సమంజసం అని వైఎస్సార్ సీపీ నాయకులు మీడియా ద్వారా ధ్వజమెత్తారు. గాంధీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయాల్లో నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం దక్కడంలేదని ఆనాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్ తీసుకువచ్చి సామాజిక సమన్యాయం ఆచరించి చూపాడని తెలిపారు. 2019- 24 మధ్య ఈ పదవి బీసీ అయిన నేపథ్యంలో, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఎస్సీ మహిళకు రిజర్వేషన్ అవగా, ఓసీలకు కట్టబెట్టాలని చూడటం దారుణమన్నారు. పార్టీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్ మాట్లాడుతూ ఎస్సీలు అంటే మీకు ఎందుకు అంత చులకన అని ప్రశ్నించారు. లేని పక్షంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. పార్టీ రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి దర్శనాల వెంకటరమణ, ఎస్సీసెల్ జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు సామగ్రి వితరణ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌కు కేర్స్ ఫౌండేషన్ నిర్వాహకురాలు గుండా రితికా స్వరాజ్(యూఎస్ఏ) రూ.40,600 విలువైన ఇన్వర్టర్, వాటర్ కూలర్, టీచర్స్ టేబుల్స్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) చేతుల మీదుగా వాటిని పాఠశాల హెచ్ఎం కె.హేమ మాధవికి అందజేశారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ విద్యార్థులు సేవాభావం పాఠశాల స్థాయి నుంచే అలవరచుకోవాలని సూచించారు. పూర్వ విద్యార్థిని అయిన వేముల అనిత ద్వారా పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ సహకారంతో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, దాత తాత వేముల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

నందిగామ టౌన్: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రిన్సిపాల్ రమేష్ తివారి పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో కలిసి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటటంతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు. మొక్కలు నాటటం వల్ల గ్లోబల్‌వార్మింగ్ వంటి ఉపద్రవాలను నివారించవచ్చని చెప్పారు. వాహనాలు, పరిశ్రమల నుంచి వెలువడే పొగ వలన పర్యావరణం కలుషమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ వినోద్ కుమార్, డీన్ జాన్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం

ఏసీపీ వై. ప్రసాదరావు

మైలవరం: విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యమని, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఏసీపీ వై. ప్రసాదరావు పేర్కొన్నారు. యాంటీ ర్యాగింగ్, మత్తు పదార్థాలు అంశంపై అవగాహన సదస్సు మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ నేరమన్నారు. ర్యాగింగ్ భూతాన్ని తరిమివేయాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ తోటి విద్యార్థులలో సోదరభావంతో మెలగాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయన్నారు. మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్, ఎస్ఐలు ఏవీ కృష్ణారెడ్డి, టి. దుర్గాభవాని మాట్లాడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ పెట్టే కేసులకు భయపడొద్దు

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి ప్రకాష్



మాట్లాడుతున్న ముదిగొండ ప్రకాష్, పక్కన ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో ఎస్సీలకు గొప్ప ప్రాధాన్యత కల్పించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్ అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు నేతృత్వంలో జరిగిన నియోజకవర్గ ఎస్సీసెల్ ముఖ్య నాయకుల సమావేశంలో ప్రకాష్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. నియోజకవర్గంలో ఎస్సీ సోదరులంతా పార్టీ కోసం ఐక్యంగా పనిచేయాలన్నారు. అధికార పార్టీ వారు పెట్టే అక్రమ కేసులకు భయపడవద్దన్నారు. ఈ సందర్భంగా ప్రకాష్‌ను తన్నీరు నాగేశ్వరరావు సన్మానించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి కామెర్ల జోజి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు టోలిమెట్ల శరత్, రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి దర్శనాల వెంకటరమణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, ఎస్సీసెల్ జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

పలువురికి అభినందనలు

వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ పట్టణ అధ్యక్షుడిగా నియమితులైన ఊసా సురేష్, పట్టణ ప్రచార విభాగం అధ్యక్షుడిగా నియమితులైన చింతమాల లక్ష్మణ్‌లను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి కామెర్ల జోజి, జిల్లా అధ్యక్షుడు టోలిమెట్ల శరత్ తదితరులు అభినందించారు.

మట్టి ప్రతిమలను ప్రోత్సహించాలి



ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు



బంకమట్టితో చేసిన విగ్రహాలు

- విరివిగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగంతో నష్టం
- ఈనెల 27న వినాయక చవితి

పెనుగంచిప్రోలు: బంకమట్టితో తయారు చేసిన విగ్రహాలే వినియోగించాలి.. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీరు కలుషితం అవుతుంది. తద్వారా నీటిలో నివశించే ఎన్నో రకాల జలచరాలకు ముప్పు వాటిల్లుతుంది. ఇలాంటి మాటలు మనం ప్రతి వినాయక చవితికి వింటున్నాం. నియోజకవర్గంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో తయారు చేసి అమ్ముతున్న విగ్రహాల్లో 90 శాతం ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసినవే ఉన్నాయి. అధికారులు, పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మట్టి ప్రతిమలు ఉపయోగించాలని చెప్పిన మాటలు ఆచరించాల్సిన అవసరం ఉంది.

మట్టి ప్రతిమలు వాడకపోతే నష్టమే..

రసాయనాలు విగ్రహాలు నిమజ్జనం చేసినప్పుడు నీటిలో కలవటం వలన జలచరాలు నశిస్తాయి. నీటిలో కరగటానికి చాలా సమయం పడుతుంది. ఈ నీటిలో మునగటం వలన మనుషులకు కూడా చర్మ సంబంధమైన, ఊపిరి తిత్తులకు సంబంధించిన వ్యాధులు వస్తాయని వైద్యులు అంటున్నారు. అదే బంకమట్టితో తయారు చేసిన విగ్రహాల వలన ఎటువంటి ఇబ్బంది ఉండదని అంటున్నారు. ఈఏడాది ఆగస్టు 27న వినాయక చవితి పర్వదినం రానుంది. ఇప్పటికైనా అధికారులు ప్రజలకు విగ్రహాల తయారీపై అవగాహన కల్పించాలని, మట్టి విగ్రహాలు వాడేలా ప్రోత్సహించాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ



జాగ్రత్తలు తెలియజేస్తున్న ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, పక్కన తహసీల్దార్ శాంతిలక్ష్మి

పెనుగంచిప్రోలు: కొద్దిపాటి జాగ్రత్తలతో ప్రమాదాలను నివారించవచ్చని జగ్గయ్యపేట ఫైర్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద గ్యాస్ ప్రమాదాలపై దుకాణదారులకు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ పైపులు కంపెనీవి మాత్రమే వాడాలన్నారు. ఆర్డినరీ పైపులు వాడితే లీక్ అవుతాయన్నారు. సిలిండర్ తీసుకునే ముందు సిలిండర్ ముగింపు తేదీతో పాటు ఓపెన్ చేసిన వెంటనే లీక్ అవుతుందా లేదా మొదటిగా చూసుకోవాలన్నారు. సిలిండర్ మంటలు వ్యాపించిన వెంటనే పేలదని, సిలిండర్‌లోని లిక్విడ్ మొత్తం ఆవిరై వేడి ఎక్కిన తరువాత మాత్రమే పేలుతుందన్నారు. మంటలు వ్యాపించిన వెంటనే సిలిండర్ బయటకు తీసుకు వచ్చి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి మాట్లాడుతూ ప్రతి మహిళ వంట గదిలో కొద్ది జాగ్రత్తలు తీసుకుంటే పెద్ద ప్రమాదాన్ని ఆపిన వారవుతారన్నారు. ప్రమాదాలు మనం జాగ్రత్తగా లేక పోవటం వల్లే జరుగుతా యన్నారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ సిద్ధారెడ్డి, ఆర్ఐ హలీమ్, వీఆర్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



జగ్గయ్యపేటలో తల్లిపాల ప్రాధాన్యతను వివరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని రెండవ సెక్టార్ పరిధిలోని 16 వార్డు ఆకులవారి వీధిలోని 2, 3వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, రాజ్యలక్ష్మి, సహాయకులు వాణి, షేక్ సఫియా, తల్లులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు తాగించాలి

నందిగామ రూరల్: తల్లిపాలు పట్టటం వల్ల బిడ్డకు సమతుల ఆహారం అందుతుందని సీడీపీవో లక్ష్మీభార్గవి పేర్కొన్నారు. మండలం, పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు పట్టటం వల్ల బిడ్డ, తల్లి ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. బిడ్డ పుట్టిన అరగంటలోగా విధిగా ముర్రుపాలు పట్టించాలని సూచించారు. సూపర్‌వైజర్‌లు వెంకట్రావమ్మ, కరుణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చందర్లపాడు(నందిగామ టౌన్): తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానమని సీడీపీవో లక్ష్మీబార్గవి పేర్కొన్నారు. చందర్లపాడు గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు తాగటం వల్ల బిడ్డకు ఆరోగ్య పరమైన సమస్యలను నివారించవచ్చన్నారు. వైద్యురాలు సమతరూత్, విజయవాహిని ట్రస్ట్ భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్‌లు శ్రీదేవి, శ్రీలత, ఇస్రత్, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరం

వీరులపాడు: బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరమని వైద్యాధికారులు మనోరమ, నందినిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వీరులపాడు గ్రామంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన ఆరు నెలల పాటు విధిగా తల్లిపాలు పట్టాలన్నారు. బిడ్డకు తల్లిపాలు పట్టటం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుమతి, రత్నకుమారి, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలుని శాంతి కల్యాణం

తిరువూరు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానంలో గత మూడు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి కల్యాణం నిర్వహించారు. వేణుగోపాల మహామంత్ర సహా పౌండరీక మహాశాంతి హోమం, నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ సంధ్య, ఆలయ కమిటీ చైర్మన్ శశిరేఖ, భక్తులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు కొనసాగించడం సిగ్గుచేటు



విద్యుత్ శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

వత్సవాయి: పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను వెంటనే తొలగించాలని కోరుతూ బుధవారం వత్సవాయిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఆదానీ మీటర్లను బిగించి ప్రజలపై భారం మోపుతున్నారని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చి తీరా అధికారంలోనికి వచ్చిన తరువాత వాటినే కొనసాగించడం సిగ్గుచేటన్నారు. విద్యుత్ భారాలను తగ్గిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి ఏడాదిలో రూ.15,485 కోట్ల సర్దుబాటు చార్జీలను అదనంగా మోపారన్నారు. మొత్తం నాలుగు రకాలను సర్దుబాటు చార్జీలను వసూలు చేస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల షాపులు, చిన్నపరిశ్రమలకు రెండు, మూడు రెట్లు మరికొందరికీ అంతకంటే ఎక్కువ రెట్లు అదనంగా బిల్లులు వస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ మీటర్లను తొలగించి, అదనపు చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ హనుమంతురావు, బి.రాము, కందుల కోటయ్య, వై వెంకటరత్నం, బి. భిక్షం, ఎం.రామచంద్రరరావు, కె.చిన్నవెంకటేశ్వర్లు, పి. కోటేశ్వరరావు, కోటయ్య, బుల్లోడు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



రాయనపాడు (విజయవాడ రూరల్): రాయనపాడు, గొల్లపూడి, ఈలప్రోలు గ్రామాల్లో ఫ్లైఓవర్ బ్రిడ్జీల నిర్మాణం చేపట్టాలని కోరుతూ గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నర్రా వాసు, మాజీ ఉప ఎంపీపీ కాటంనేని పూర్ణచంద్రరావులు రైల్వే జనరల్ మేనేజర్ శ్రీవాత్సవకు వినతిపత్రం అందజేశారు. రాయనపాడు రైల్వేస్టేషన్‌ను శ్రీవాత్సవ బుధవారం సందర్శించారు. శ్రీవాత్సవను వారు కలిసి స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పంపిన లెటర్‌ను వారు అందజేశారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులకు అవసరమైన భూ సేకరణ త్వరగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.